నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొండాపూర్ కేవీ డొమెస్టిక్ ఫీడర్ పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఉదయం 11.00 నుంచి 11.30 వరకు, 11కేవీ చందుపట్లగూడ ఫీడర్‌లోని ఏదులాబాద్, కొత్తగూడ, చందుపట్లగూడ గ్రామంలో సాయంత్రం 4.00నుంచి 4.30 గంటల వరకు, కేపీ ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కొనిగూడ ఫీడర్ పరిధిలోని బొక్కొనిగూడ, ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో సాయంత్రం 4.30నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్‌రెడ్డి తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



ఘట్‌కేసర్: పట్టణంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం కలశ స్థాపన, మంటపారాధన, మూల విగ్రహ జలాధివాసం హోమం, సాయంత్రం ధాన్యాదివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, పరదోషపూజ, మంత్రపుష్పం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అనుమానాస్పదస్థితిలో కార్మికుడి మృతి

కుషాయిగూడ: అనుమానాస్పదస్థితిలో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్.రామారావు(55) అనే వ్యక్తి చర్లపల్లి పారిశ్రామికవాడలో కార్మికుడిగా పనిచేస్తూ చిన్న చర్లపల్లిలో నివాసం ఉంటున్నాడు. చర్లపల్లికి చెందిన రాములు అనే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. ఈనెల 11 నుంచి పనికి వెళ్లలేదు. ఈ క్రమంలో రామారావు గది నుంచి దుర్వాసన రావడంతో యజమాని రాజు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గడియ పగులగొట్టి చూడగా రామారావు విగతజీవిగా పడి ఉన్నాడు. అతడు మూడ్రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు అతిగా మద్యం తాగడం, అనారోగ్యం కారణంగా మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట ఉరేసుకుని పాలవ్యాపారి..

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో ఓ పాల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ హరిజనబస్తీ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన దేవేందర్ (40) వృత్తి పాల వ్యాపారం. కాగా ఈనెల 15న రాత్రి భోజనం చేసి ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్ద సాయిబాబా దేవాలయం వెనక ఉన్న గేదెల దొడ్డికి పాలు తెచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. రాత్రైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్‌చేయగా.. ఎత్తకపోవడంతో వెళ్లి చూశారు. అప్పటికే షెడ్డులో ఉరేసుకుని కనిపించాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు సమస్యలు తీరేనా !

గౌతంనగర్: డివిజన్ పరిధిలో వర్షం పడిన ప్రతిసారి పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజశ్రీనివాస్‌నగర్, చిన్మయిమార్గ్ తదితర ప్రాంతాల్లో వర్షం పడిన ప్రతిసారి రోడ్లపై మోకాళ్ల లోతు నీరుచేరి ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే చాలు కంటిమీద కునుకు లేకుండా జాగారాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రధానంగా రోడ్డు ఆక్రమణల వల్లే సమస్య ఉత్పన్నమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముంపు సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కేన్సర్ రోగికి ఆర్థికసాయం

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన మారోజు సోమరాజు లీవర్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. సమాచారం అందుకున్న విస్సు ట్రస్ట్ చైర్మన్ బంగారు తాతారావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.41 వేల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆర్థికసాయం అందించిన విస్సు ట్రస్ట్ ప్రతినిధులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు. విశ్వబ్రాహ్మణ, మల్లేష్‌చారి, రమేష్‌చారి, శ్రవణ్‌కుమార్, సుకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు బద్దం పరుశురామ్‌రెడ్డి, గోపాల్, మల్లేష్ తదితరులున్నారు.

ప్రజల అనారోగ్యానికి బాధ్యులెవరు ?

- సరఫరాకు నోచుకోని నల్లా నీరు
- ధన దాహమే లక్ష్యంగా వాటర్ ప్లాంట్ల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, పట్టించుకోని అధికారులు



ఓ కిరాణ షాప్‌లో విక్రయించేందుకు ఉంచిన వాటర్ క్యాన్లు

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో అనుమతిలేని నీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. నీటి కొరతను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా వాటర్ ప్లాంట్లలోని నీటిని యదేచ్ఛగా మార్కెట్లోకి వదులుతున్నారు.

కార్పొరేషన్ నీరు అందక ఇబ్బందులు.

ప్రతి వేయి మందిలో 80 శాతం మందికి పైగా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న నీటినే వినియోగిస్తున్నారు. జవహర్‌నగర్‌లో దాదాపు రెండు లక్షల మంది నివాసం ఉంటున్నారు. కార్పొరేషన్ అధికారులు తాగునీటిని అందించకపోవడంతో ప్రజలందరూ పూర్తిగా ఆర్వో నీటిని కొనుగోలు చేసుకుని వారి అవసరాలు తీర్చుకుంటున్నారు.

అనుమతి ఇలా...

వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అనుమతి తీసుకోవాలంటే ముందుగా 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్' (ఐబీఎస్) పేరిట చలాన కట్టి చెన్నైలోని ఆ సంస్థ ఇనిస్టిట్యూట్‌కు పంపాలి. చలానా అందిన తర్వాత సదరు సంస్థ ప్రతినిధులు వచ్చి వాటర్ ప్లాంటును పరిశీలించడంతో పాటు నీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నీటిని తీసుకెళ్తారు. ఆ తర్వాత మూడుసార్లు వచ్చి నీటి నమూనాను పరీక్షిస్తుంటారు. నీటి నాణ్యత సంతృప్తికరంగా ఉంటేనే ఐబీఎస్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ సర్టిఫికెట్‌ను ఆహార కల్తీ నిరోధకశాఖకు సమర్పిస్తేనే ప్లాంటు నిర్వాహణకు అనుమతి లభిస్తుంది. చలానా అందిన తర్వాత సదరు సంస్థ 4 సార్లు సంబంధిత ప్లాంటు నిర్వాహకుడికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే నిర్వాహకుడు నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నట్లు చూపించాలి.

కనిపించని అడ్రస్సు..

జవహర్‌నగర్‌లో దాదాపు 40 ఆర్వో వాటర్ ప్లాంట్లు ఉండగా.. వీటిలో సగానికి పైగా అనుమతి లేకుండానే నడుస్తున్నాయి. వీటి మీద తయారీదారుల పేర్లు ఉండటం లేదు. నాణ్యమైన కవర్లు, బాటిళ్లు ఉపయోగించడం లేదని, బీఐఎస్ మార్కు కూడా లేదని పలువురు చెబుతున్నారు.

అనుమతి లేకుండానే ప్లాంట్ల నిర్వహణ

ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు అనుమతి లేకుండా ప్లాంట్లను నెలకొల్పుతున్నారు. ఒక్కొక్కరు రోజుకు సరాసరి 400 క్యాన్లు విక్రయిస్తున్నారు. 12,000 వేల క్యాన్ల విక్రయం జరుగుతుంది. ఇలాంటి నీటిని తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇంటికి సరఫరా చేస్తే క్యాను ధర రూ.10 ఉండగా.. ప్రస్తుతం రూ.15 నుంచి 20 వరకు పెరిగింది. దీంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది.

పత్తాలేని మంజీరా నీరు

ప్రతి ఇంటికి నల్లా నీరు అందిస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. జవహర్‌నగర్‌కు మంజీరా నీరు అందించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసినా దానిని అమలుచేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మంజీరా నీటిని అందించి, అనుమతిలేని వాటర్ ప్లాంట్లను మూసివేయడంతో పాటు పెరిగిన ధరలను తగ్గించాలని నియంత్రించాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి..

వాటర్ ప్లాంట్ల యజమానులు బోరు నీటిలో కొన్ని లవణాలను తొలగించి నీటిని విక్రయిస్తున్నారు. నీటిని శుభ్రంచేసి ప్యాకింగ్ చేయాలంటే ఆహార నిరోధక శాఖ అధికారుల నిబంధనలను పాటించాలి. పరిశ్రమల నుంచి అనుమతితో పాటు బీఐఎస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. యూవీ కిరణాల ద్వారానే శుభ్రం చేయాలి.

◆ ప్లాంట్ల సామర్థ్యం 30 హెచ్‌పీ దాటితే పంచాయితీ, విద్యుత్, భూగర్భశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రతి ప్లాంటులో కెమిస్ట్రీ, మైక్రోల్యాబ్‌లు ఉండాలి. నీటిని 3 దశల్లో శుద్ధి చేయాల్సి ఉంటుంది. తొలుత క్లోరినేషన్, ఆపై శాండ్ ఫిల్టర్‌లో వడకట్టాలి. తర్వాత కార్బన్ ఫిల్టర్‌లో 25 మైక్రాన్ కంటే సూక్ష్మస్థాయిలో ఉన్న ఫిల్టర్‌లో వడకట్టాలి. ఇలా వచ్చిన నీటిని మాత్రమే వినియోగించాలి. కానీ చాలా ప్లాంట్లు ఆర్‌ఓ సిస్టమ్ ద్వారానే నీటిని శుద్ధి చేస్తున్నారు.

◆ ఆర్‌ఓ నీటిని పరీక్షించేందుకు తగిన ల్యాబ్‌లు, పరికరాలు లేవు. క్యాన్లను శుభ్రం చేసే సమయంలో వేడి నీటిని వినియోగించాలి. ఈ నిబంధనలను ఎవరూ పాటించకుండా పుట్టగొడుగుల్లా ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు.

జాడకైనా కనిపించని ఐఎస్‌ఓ..

మినరల్, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లలో కనీస నియమాలు పాటించి, స్వచ్ఛమైన నీటిని అందించే ప్లాంట్లకు ఐఎస్‌ఓ అనుమతి ఉంటుంది. జవహర్‌నగర్‌లోని ఆయా ప్లాంట్లకు కనీసం మున్సిపల్ అనుమతి కూడా లేదని పలువురి వాదన.

అనుమతులులేని ప్లాంట్లపై చర్యలు తీసుకుంటాం



జవహర్‌నగర్‌లో చాలా వరకు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు అనుమతులు తీసుకోలేదు. వాల్టా చట్టం ప్రకారం తప్పకుండా బోరు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కార్పొరేషన్ అనుమతితో పాటు ఆహారకల్తీ నిరోధకశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్స్ పొందాల్సి ఉంటుంది. అనుమతులు లేని ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకుంటాం.

– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

రైల్వే వంతెన పనులు పూర్తి చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. పనులు నిలిపేయాలని కోర్టుకెళ్లిన 14 మందితో కేసును విరమింపజేయాలని కోరారు. గతంలో మండల పరిషత్ కార్యాలయంగా ఉన్న భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలన్నారు. మల్లేష్, దేవేందర్‌ముదిరాజ్, నాగరాజుముదిరాజ్, ఆంజనేయులుయాదవ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు



షేక్‌షావలి, ఐఎఫ్‌టీయూ నేత

జవహర్‌నగర్: జులై 9న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) జాతీయ కన్వీనర్ షేక్ షావలి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసిస్తూ 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహించగా.. జులై 9కి వాయిదా పడింది. 4 లేబర్ కోడ్‌లను కేంద్రప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ధాన్యంలో తేమ, తాలు లేకుండా చూసుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

మేడ్చల్: రైతులు పండించిన వరిధాన్యంలో తేమ శాతం 17 శాతం, ధాన్యంలో తాలు లేకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. మేడ్చల్ పట్టణంలో ధాన్యం కొనుగోలు విషయంలో కొర్రీలు పెడుతున్నారని, గురువారం రైతులు కేంద్రం వద్ద ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన ఆమె శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఆందోళనపై ఆరా తీశారు. రైతులతో చర్చించి వరిధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే ముందు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాలు లేకుండా శుభ్రంగా ధాన్యం ఉంచాలని, తేమ శాతం సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్రంలోని సిబ్బంది, స్థానిక అధికారులను ఆదేశించారు. ఏడీఏ వెంకట్రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి అర్చన, ఏఈఓ సుమిత, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ఎంతో గొప్పది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: కనిపించే దేవుళ్లే వైద్యులని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యవృత్తి గొప్పదని, దేవుడు జన్మనిస్తే వైద్యులు చావు బతుకుల్లో ఉన్నవారికి పునర్జన్మను ఇస్తారన్నారు. వైద్య వృత్తిలో ఉన్నవారు మానవతా దృక్పథంతో నిరుపేదలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వైద్య కళాశాల చైర్మన్‌డాక్టర్ గోపాల్ రెడ్డి, సీఈవో అభినవ్‌రెడ్డి, కార్యదర్శి వసంతలత, యాజమాన్య కమిటీ సభ్యులు అనురాగ్‌రెడ్డి, ఐశ్వర్య, డీన్ డాక్టర్ వెంకటరమణయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఎంరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ అలీబేగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రైతుల నుంచి 4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్‌లతో ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రులు మాట్లాడుతూ.. 2023 రబీ సీజన్‌లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ముందెన్నడూ లేని విధంగా చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ జిల్లా నుంచి జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ, జిల్లా సివిల్ సప్లై జీఎం సుగుణబాయి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతను పెంపొందించుకుని బోధన చేపట్టాలి

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మల్లాపూర్: ఉపాధ్యాయులు సాంకేతికతకు అనుగుణంగా సామర్థ్యాలను పెంపొందించుకుని విద్యను బోధించాలని మేడ్చల్, మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా టెక్నాలజీ యుగంలో విద్యాబోధన సామర్థ్యాలను పెంపొందించేందుకు వేసవిలోనూ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. విద్యారంగాన్ని మరింత మెరుగుపరచాలని, దీనికి టెక్నాలజీపై పట్టు సాధించాలన్నారు. టెక్నాలజీ ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో చదవడం, వ్రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంచడానికి ప్రాధ్యానత ఇవ్వాలన్నారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్, జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి, ఉప్పల్ తహసీల్దార్ వాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మల్లారెడ్డి కళాశాలలో విద్యార్థినులకు ఉచిత శిక్షణ

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజినీరింగ్ చేయాలనుకునే ఎంపీసీ విద్యార్థినులకు పలు కోర్సుల్లో ఉచితశిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత ప్రకటించారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు జూన్ 2 నుంచి 7 వరకు ఉదయం, మధ్యాహ్నం 30 గంటల పాటు 'ప్రోగ్రామింగ్ ఫర్ ఏఐ అప్లికేషన్స్', 'ఇంట్రడక్షన్ టూ వెబ్ డెవలప్‌మెంట్', 'సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్', 'డాటా సైన్స్ ప్రోగ్రామింగ్ విత్ పైథాన్' కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 25లోగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7386200587, 934618803.

నేడు ఉచిత వైద్య శిబిరం

జవహర్‌నగర్: లిటిల్ వన్స్ క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి విద్యాభూషన్ తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో నిర్వహించనున్న శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్తపు మడుగులో నవజాత శిశువు !

అంబులెన్స్ వచ్చేలోపే మృతి, గాంధీకి తరలింపు

జవహర్‌నగర్ : జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో నవజాత శిశువు రక్తపు మరకలతో చెత్తకుప్పలో కనిపించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో అప్పుడే పుట్టిన మగశిశువు మెడకు బొడ్డుతో చెత్తకుప్పలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నవజాత శిశువును పరిశీలించి 108కు సమాచారం అందించగా.. వారు వచ్చేసరికి శిశువు మరణించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేస దర్యాప్తు చేస్తున్నారు.

గోనె సంచులకు రైతుల అగచాట్లు !

మేడ్చల్: మేడ్చల్ మండలం, డబ్బిల్‌పూర్ సొసైటీ పరిధిలోని కోనాయిపల్లిలో శుక్రవారం రాత్రి గోనే సంచులు రాగా.. రైతులు ఎగబడి తీసుకున్నారు. రాత్రి 8 గంటల తర్వాత సంచులు లారీలో రావడంతో రైతులు వేచిచూసి పోటీపడి సంచులు తీసుకెళ్లారు. రైతులకు అవసరం ఉన్న సమయంలో సంచులు సరఫరా చేయకుండా రాత్రి వేళల్లో తెప్పించడంతో అధికారుల తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు రైతులు ధాన్యం విక్రయించడానికి ఇబ్బంది పడుతున్నారని శ్రీ రంగవరం మాజీ సర్పంచ్ పోచయ్య విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద గోనె సంచుల కొరత తీవ్రంగా వేధిస్తోందని, అధికారులు సంచులను సరఫరా చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. సంచుల కోసం రోజుల తరబడి వేచి చూస్తున్నామని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం



పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: కాలనీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని జవహర్‌నగర్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. 5వ డివిజన్‌లోని జ్యోతిరావు పూలే కాలనీలో మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ సహకారంతో కాలనీవాసులు సొంత డబ్బులు వెచ్చించి రూ.10 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని జ్యోతిరావుపూలే కాలనీలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అభివృద్ధిలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. సింగన్నబాలరాజ్, శ్రీమన్నారాయణ, మాధవ్, చంద్రమౌళి, మహేశ్వరి, విజయ, మల్లమ్మ, రామకృష్ణ, రామ్మోహన్, పవన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గట్టు మైసమ్మ ఆలయంలో చోరీ



దుండుగులు ధ్వంసం చేసిన ఆలయ హుండీలు

ఘట్‌కేసర్: గట్టుమైసమ్మ ఆలయంలోని 6 హుండీలోని సొత్తును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. డీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గట్టుమైసమ్మ ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి గురువారం సాయంత్రం ఆలయ కార్యాలయానికి తాళం వేసి ఇంటికెళ్లింది. ఆలయం తలుపు తాళం విరిగిపోయి ఉన్నాయని, వాచ్‌మెన్ శుక్రవారం ఉదయం ఈఓకు సమాచారం అందించాడు. వెంటనే ఈఓ ఇతర సిబ్బందితో వచ్చి ఆలయాన్ని పరిశీలించగా.. 4 హుండీల తాళాలు పగులగొట్టి అందులో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయ పరిసరాలు వెతకగా సమీపంలోని చెట్ల పొదల్లో మరో రెండు హుండీలు విరిగిన స్థితిలో లభ్యమయ్యాయి. హుండీల్లో సుమారు రూ. 30 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారని ఆలయ అధికారి భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఐ క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీని ప్రారంభించిన బొంతు శ్రీదేవి

కాప్రా: డెంగీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి డెంగీని తరిమికొట్టాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి కమలానగర్ మీదుగా ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగగా.. సర్కిల్ కార్యాలయంలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వివిధ దశల లార్వా, లైవ్ ఎడిస్ మాస్కిటో, దోమ జీవిత చక్రం గురించి అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు

మల్కాజిగిరి: సర్దార్ పటేల్‌నగర్‌లో ముంపు సమస్య పరిష్కారమవుతుందని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఎస్పీనగర్‌లో ముంపు నివారణకు సుమారు రూ10.లక్షలతో చేపట్టిన పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికి కూడా కాలనీవాసులు ఇబ్బందికి గురయ్యేవారని, ఈ పైపులైన్ ఏర్పాటుతో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పలు అభివృద్ధి పనులకు నిధులు కాలనీలో ఖర్చుచేశామని, ప్రజల సహకారంతో పనులు పూర్తిచేస్తామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్, కాలనీవాసులు రాములు, శ్రీకాంత్, సాయిపటేల్, సూర్యప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్